# పండుగల నమాజ్

# ١٤ - بَابُ صَلاَةِ الْعِيدَيْنِ

385. హ|జత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ రోజున ప్రజలు ఉపవాసాలు అన్నీ పూర్తిచేసి 'ఇఫ్తార్' చేస్తారో ఆ రోజు వారి కొరకు పండుగ రోజు అవుతుంది. ప్రజలు ఖుర్బానీ ఇచ్చే రోజు ఈదుల్ అజ్హా అవుతుంది." (తిర్మిజీ)

(٣٨٥) عَنْ عائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الفِطْرُ يَوْمَ يُفطِرُ النَّاسُ، وَالْأَضْحَى يَوْمَ يُضَحِّي النَّاسُ». رَوَاهُ التِّرمِذِيُّ.

## సారాంశం

ముస్లింల కొరకు ఏడాదికి రెండు పండుగలు మాత్రమే ఉన్నాయని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అవి (1) ఈదుల్ ఫిత్ర్ (2) ఈదుల్ అజ్హా. ఈ రెండు పండుగలు మినహా మరో పండుగగానీ, సంబరంగానీ ఇస్లాంలో లేదు. ఈ మధ్య ముస్లింలు సృష్టించుకున్న కొంగ్రొత్త పండుగలకు షరీయత్‌తో ఏ మాత్రం సంబంధం లేదు.

పండుగలు సామూహికత యొక్క ప్రాముఖ్యతను చాటి చెబుతాయి. ఇస్లాం ప్రతిపాదించిన పండుగలలో సామూహిక స్ఫూర్తితోపాటు, ఆరాధనలు కూడా ఉన్నాయి. ఏ ఒక్క మనిషి కూడా- ఒంటరిగా - నెలవంక చూసి, ఒంటరిగా పండుగ జరుపుకోలేడు. పండుగ జరుపుకోవటానికి ముస్లిం సమాజంలోని అత్యధికులు ఆమోదించాలి.

(٣٨٦) وَعَنْ أَبِي عُمَيْرِ بْنِ أَنَسٍ، عَنْ عُمُومَةٍ لَهُ مِنَ الصَّحَابَةِ، أَنَّ رَكْباً جَاءُوا، فَشَهِدُوْا أَنَّهُمْ رَأَوُا الْهِلَالَ بِالْأَمْسِ، فَأَمَرَهُمُ النَّبِيُّ ﷺ أَنْ يُفْطِرُوْا، وَإِذَا أَصْبَحُوا أَنْ يَغْدُوا إِلَى مُصَلَّاهُمْ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَهَذَا لَفْظُهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ.

386. హజ్రత్ అబూ ఉమైర్ బిన్ అనస్ (రజి) తన పినతండ్రి అయిన ఒక సహాబీ (రజి) గారి ఆధారంగా ఉల్లేఖించారు - కొంతమంది దైవప్రవక్త (సఅసం) దగ్గరకు స్వారీ చేసివచ్చి తాము నిన్న సాయంత్రం నెలవంకను చూసినట్టు సాక్ష్యమిచ్చారు. దీనిపై ఆయన (స), "ఉపవాసాన్ని విరమించండి. రేపు దయం పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు రండి" అని ఆజ్ఞాపించారు. (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు - వాక్యాలు మాత్రం అబూ దావూద్‌లోనివి. దీని ఆధారం ప్రమాణ బద్ధమైనది)

## సారాంశం

రమజాన్ నెల 29వ రోజు సాయంత్రం - ఆకాశం నిర్మలంగా వున్న ప్రదేశంలో గనక నెలవంక కనబడి - ఆ సమాచారం మరునాడు విశ్వసనీయ వర్గాల ద్వారా అందితే - ఆ సమాచారం ఆధారంగా అప్పటికప్పుడే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయవచ్చు. అయితే పొద్దు నడినెత్తిపై రాక మునుపే సమాచారం అందితే ఆ రోజు పండుగ నమాజ్ చేయాలి. మధ్యాహ్న సమయానికి సమాచారం అందితే పండుగ మరునాడే జరుపుకోవలసి ఉంటుంది.

ఈ హదీసు ఆధారంగా తెలిసిన మరో విషయమేమిటంటే పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో జరుపుకోవటం ఉత్తమం. నెలవంక కనబడినట్టు అధికారికంగా కూడా సమాచారం అందించవచ్చు. ఇలాంటి ప్రకటన ధార్మిక సంస్థల, ధార్మిక వ్యక్తుల ద్వారా చేయించటం మంచిది. ఆధునిక యుగంలో రేడియో, టీవీ వంటి ప్రసార సాధనాల వల్ల క్షణాల్లో సమాచారం అందుతోంది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమైర్ బిన్ అనస్ (రహ్మలై) గారి అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ అన్సారీ. అనస్ (రజి) గారి పెద్దకొడుకు. యువ తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడ్డారు. 4వ కోవకు చెందిన ఉల్లేఖకులు. తన తండ్రి తరువాత చాలా కాలం వరకు జీవించారు.

(٣٨٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ لاَ يَغْدُو يَوْمَ الْفِطْرِ حَتَّى يَأْكُلَ تَمَرَاتٍ، يَأْكُلُهُنَّ وِتْرًا. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَفِيْ رِوَايَةٍ مُعَلَّقَةٍ - وَوَصَلَهَا أَحْمَدُ -: (وَيَأْكُلُهُنَّ إِفْرَادًا).

387. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ (ఈదుల్ ఫిత్ర్) కు బయలుదేరకముందు కొన్ని ఖర్జూరపు పండ్లు తినేవారు. ఈ ఖర్జూర పండ్లు బేసి సంఖ్యలో ఉండేవి.'' (దీనిని బుఖారీ ఉల్లేఖించారు - ఒక అనిశ్చిత (ముఅల్లఖ్) ఉల్లేఖనంలో కూడా ఇలాగే ఉంది. ఆయన (స) ఈ ఖర్జూర పండ్లను ఒక్కొక్కటిగా చేసి తినేవారని అహ్మద్ గారు ఒక మౌసూల్ ఉల్లేఖనంలో ప్రస్తావించారు)

## సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన దృష్టికి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవి: (1) ఈద్ నమాజ్ కోసం బహిరంగ స్థలాలకు వెళ్ళాలి. (2) పండుగ నమాజ్‌కు వెళ్ళేముందు బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లు తినటం సంప్రదాయం (సున్నత్). (3) ఖర్జూర పండ్లు ఒకేసారి అనేకం నోట్లో వేసుకునే బదులు ఒక్కొక్కటీ తినాలి. ఒకేసారి నోట్లో కుక్కటం అనాగరికం, సంస్కార విహీనం అనిపించుకుంటుంది. ఒకవేళ ఖర్జూర పండ్లు లభ్యమవకపోతే మరేదయినా తీపి పదార్థంగానీ, తీపి పండ్లుగానీ తినవచ్చు.

(٣٨٨) وَعَنِ ابْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ لاَ يَخْرُجُ يَوْمَ الْفِطْرِ حَتَّى يَطْعَمَ، وَلاَ يَطْعَمُ يَوْمَ الأَضْحَى حَتَّى يُصَلِّيَ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

388. తన తండ్రి తనతో చెప్పినట్లు హజ్రత్ ఇబ్నె బురైద తెలిపారు - "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ కొరకు ఏదైనా తినేవరకూ బయలుదేరేవారు కారు. అయితే ఖుర్బానీ పండుగనాడు ఆయన (స) నమాజ్ చేసేదాకా ఏమీ తినేవారు కారు. (అహ్మద్ మరియు తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

రమజాన్ పండుగ రోజున ఏదన్నా తిన్న తరువాత నమాజ్ చేయటం, బక్రీద్ పండుగనాడు నమాజ్ చేసిన తరువాత తినటం దైవప్రవక్త (స) విధానం. ఫలానా పదార్థమే తినాలన్న ఆంక్ష ఏమీలేదు. కాకపోతే ఖర్జూర పండ్లను 'మస్నూన్'గా భావించి వాటిని తినటం చాలా మంచిది.

(٣٨٩) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُمِرْنَا أَنْ نُخْرِجَ الْعَوَاتِقَ والْحُيَّضَ فِي الْعِيدَيْنِ، يَشْهَدْنَ الْخَيْرَ وَدَعْوَةَ الْمُسْلِمِينَ، وَتَعْتَزِلُ الْحُيَّضُ الْمُصَلَّى. مُتَّفَقٌ عَلَيْهِ.

389. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : "ముస్లింల సంక్షేమ కార్యాలలో, వేడుకోళ్లలో పాలుపంచుకునే ఉద్దేశ్యంతో, మేము పడుచు పిల్లలను, బహిష్టు స్త్రీలను కూడా పండుగలకు (ఈద్గాహ్‌లకు) తీసుకు రావలసిందిగా మాకు ఆజ్ఞాపించబడింది. అయితే బహిష్టు స్త్రీలు ఈద్గాహ్ ప్రక్కనే ఉండాలని (నమాజ్ చేయరాదని, కేవలం దుఆలో పాల్గొనాలనీ) సూచించబడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పండుగ నమాజ్ కొరకు మహిళలు ఇల్లు వదలి ఈద్గాహ్‌కు వెళ్ళటం సమంజసమేనని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (స) స్వయంగా తన సతీమణులను, కుమార్తెలను ఈద్గాహ్‌కు తీసుకు వెళ్ళేవారని ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), అలీ (రజి)లు స్త్రీలను పండుగ నమాజ్‌కు పిలుచుకు వెళ్ళటం తప్పనిసరి అని భావించేవారు.

ఈ హదీసుపై హనఫీ ధర్మవేత్తలు ఇలా వ్యాఖ్యానించారు: "ఇది ఇస్లాం ఆరంభకాలంనాటి సంగతి. ఆ రోజుల్లో ముస్లింల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. పర్వదినాలలో - ఈద్గాహ్‌లో - ముస్లింలు వీలైనంత ఎక్కువమంది పాల్గొంటే అవిశ్వాసులపై దాని ప్రభావం పడుతుందన్న ఉద్దేశ్యంతో మహిళలను సయితం గొనిపోయేవారు."

అల్లామా తహావీ ఎంతో కష్టపడి సేకరించిన ఈ సమాచారంలో పసలేదు. ఎందుకంటే హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఈ (పండుగ) సంఘటన మక్కా విజయం తరువాత సంభవించింది. దైవకృపవల్ల అప్పటికే ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగింది. మక్కా మదీనాలలో దాదాపు ఇస్లామీయ వ్యవస్థ నెలకొన్నది.

ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే ఈద్గాహ్‌లలో స్త్రీలు పాల్గొనటం మంచిది. ఇది దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఒక ఆదర్శం.

(٣٩٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ وَأَبُو بَكْرٍ وَعُمَرَ يُصَلُّونَ الْعِيدَيْنِ قَبْلَ الْخُطْبَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

390. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం), హజ్రత్ అబూ బక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు పండుగ నమాజుల సందర్భంగా ప్రసంగానికి ముందే నమాజు చేసేవారు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పండుగలలో తొలుత నమాజ్ చేసి, ఆ తరువాత ప్రసంగం చేయాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. బనూ ఉమయ్య పరిపాలనా యుగంలో మర్వాన్ అనే పరిపాలకుడు ముందు ప్రసంగించి తరువాత నమాజ్ చేసే దురాచారాన్ని (బిద్అత్ను) ఆరంభించాడు. ఆ సమయంలో హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) దీనిపై తీవ్ర నిరసన తెలిపారు. 'నీవు సున్నత్కు విరుద్ధమైన పని మొదలెట్టావు' అని ఆయన పరిపాలకుని మొహం మీదే చెప్పేశారు. (సహీహ్ ముస్లిం)

(٣٩١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى يَوْمَ الْعِيدِ رَكْعَتَيْنِ، لَمْ يُصَلِّ قَبْلَهُمَا وَلَا بَعْدَهُمَا. أَخْرَجَهُ السَّبْعَةُ.

391. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున రెండు రకతుల నమాజ్ మాత్రమే చేశారు. దీనికి ముందుగానీ, తరువాతగానీ ఆయన (స) మరే నమాజూ చేయలేదు." (దీనిని ఏడు గురూ-అంటే అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా - ఉల్లేఖించారు)

## సారాంశం

ఈ హదీసు ప్రకారం ఈద్గాహ్లో ఈ రెండు రకతుల పండుగ నమాజ్ తప్ప మరే నమాజూ దైవప్రవక్త (స) చేయలేదు. అయితే ఇంటికి తిరిగి వచ్చిన మీదట రెండు రకతులు చేసేవారు.

(٣٩٢) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى الْعِيدَ بِلَا أَذَانٍ وَلَا إِقَامَةٍ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

392. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "అజాన్, ఇఖామత్లు చెప్పకుండానే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ చేయించారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు -దీని మూలం బుఖారీలో ఉంది)

## సారాంశం

పండుగ నమాజ్ కోసం అజాన్, ఇఖామత్‌లు చెప్పవలసిన అవసరం లేదు. ఒకవేళ ఎవరయినా అజాన్, ఇఖామత్ ఇస్తే వారు బిద్అత్ (కొత్త పోకడ)ను సృష్టించినవారే అవుతారు.

(٣٩٣) وَعَنْ أَبِيْ سَعِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ لاَ يُصَلِّيْ قَبْلَ الْعِيْدِ شَيْئاً، فَإِذَا رَجَعَ إِلَى مَنْزِلِهِ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ حَسَنٍ.

393. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్‌కు ముందు ఏ నమాజూ చేసేవారు కాదు. అయితే ఇంటికి వచ్చిన తరువాత రెండు రకతుల నఫిల్ నమాజు మాత్రం చేసే వారు." (దీనిని ఇబ్నె మాజ స్పష్టమయిన ఆధారంతో ఉల్లేఖించారు)

(٣٩٤) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَخْرُجُ يَومَ الْفِطْرِ وَالْأَضْحَى إِلَى الْمُصَلَّى، وَأَوَّلُ شَيْءٍ يَبْدَأُ بِهِ الصَّلاَةُ، ثُمَّ يَنْصَرِفُ، فَيَقُومُ مُقَابِلَ النَّاسِ - وَالنَّاسُ عَلَى صُفُوفِهِمْ - فَيَعِظُهُمْ وَيَأْمُرُهُمْ. مُتَّفَقٌ عَلَيْهِ.

394. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ మరియు ఈదె ఖుర్బానీ కొరకు ఈద్గాహ్‌కు రాగానే చేసే మొదటి పని నమాజ్ చేయించటం. నమాజ్ పూర్తయిన వెంటనే ఆయన (స) ప్రజల వైపునకు తిరిగి నిలబడేవారు. ప్రజలు తమ తమ పంక్తుల్లో కూర్చుని వుండగా ఆయన (స) వారికి హితబోధ చేసేవారు. మంచిని పెంపొందించమని ఆజ్ఞాపించేవారు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా క్రింది అంశాలు వెలుగులోకి వస్తాయి -

(1) పండుగ నమాజుకు మునుపు దైవప్రవక్త (సఅసం) మరే ఆచరణా చేసినట్టు ఆధారం లేదు. (2) నమాజ్ చేసిన తరువాత ప్రసంగించాలి. (3) ఉపన్యాసకుడు ప్రజల వైపునకు తిరిగి నిలబడాలి. (4) ఉపన్యాసం నిలబడి ఇవ్వాలి. ప్రతి ఉపన్యాసకుడూ ఉపన్యసించే సమయంలో ప్రజలకు ధర్మబోధ చేయాలి. సదాచరణ గురించి నొక్కి వక్కాణించాలి. అనవసర వ్యాఖ్యలకు, కాలక్షేపపు కబుర్లకు అందులో తావుండరాదు.(5) ప్రసంగం కొనసాగే సమయంలో ప్రజలు తమ తమ స్థానాలలో నిశ్శబ్దంగా కూర్చోవాలి. ఉపన్యాసకుని వైపునకు తిరిగి కూర్చోవాలి. (6) పండుగ

నమాజ్‌ను వీలయినంత వరకు ఈద్గాహ్‌లోనే చేయాలి. ఈ మధ్య జనులు తగు కారణమేదీ లేకుండానే తమ పేటలో వున్న మస్జిదులలో పండుగ నమాజ్ చేస్తున్నారు. ఇది హర్షించదగ్గ విషయం కాదు. (7) దైవప్రవక్త (సఅసం) పండుగ రోజు ప్రసంగం కొరకు వేదికను ఉపయోగించలేదు. అందరికన్నా ముందు ఈద్గాహ్‌లో వేదికను ప్రతిష్ఠించిన వ్యక్తి మర్వాన్ అనీ, అతడు దానిపై నిలబడి ఉపన్యసించాడనీ బుఖారీలో ఉంది. అయితే ఇబ్నె హిబ్బాన్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకసారి ఒంటెపై కూర్చొని పండుగ ప్రసంగం చేశారు. కనుక అవసరం మేరకు వాహనంపై నుంచి కూడా ప్రసంగించవచ్చునన్న దానికి ఇదొక నిదర్శనం.

(٣٩٥) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ نَبِيُّ اللهِ ﷺ: «التَّكْبِيرُ فِي الْفِطْرِ سَبْعٌ فِي الْأُولَى، وَخَمْسٌ فِي الْآخِرَةِ، وَالْقِرَاءَةُ بَعْدَهُمَا كِلْتَيْهِمَا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَنَقَلَ التِّرْمِذِيُّ عَنِ الْبُخَارِيِّ تَصْحِيحَهُ.

395. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి గారినుండి, మరి ఆయనేమో తన తాతగారి నుండి గ్రహించిన విషయాన్ని ఇలా తెలియజేస్తున్నారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు : "ఈదుల్ ఫిత్ర్ నమాజు మొదటి రకత్‌లో ఏడు తక్బీర్లు, రెండవ రకతులో ఐదు తక్బీర్లు ఉన్నాయి. రెండు రకతులలోనూ తక్బీర్ల అనంతరమే ఖిరాత్ (ఖుర్‌ఆన్ పారాయణం) ఉంటుంది." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు - తిర్మిజీ గారు ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) నుండి దీని ప్రామాణికతను నకలు చేశారు)

**సారాంశం**

పండుగ నమాజులలో 12 అదనపు తక్బీర్లు ఉన్నాయని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ సాద్ (రజి), హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తదితర సహాబీల ఉల్లేఖనాలు కూడా ఈ హదీసుకు అనుకూలంగా ఉన్నాయి. అనేక మంది తాబయీలు, మదీనా ధర్మవేత్తల (ఫుకహా)తో పాటు ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయీ కూడా ఈ హదీసు ప్రకారమే ఆచరించారు. తిర్మిజీ వ్యాఖ్యాత అల్లామా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి దీని గురించి జరిపిన చర్చ తిరుగులేనిది.

అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు కొంతమంది కూఫా ధర్మవేత్తలు మాత్రం 6 అదనపు తక్బీర్లతో పండుగ నమాజ్ చేయాలని అభిప్రాయపడ్డారు. అంటే మొదటి రకతులో ఖిరాత్‌కు ముందు 3 తక్బీర్లు, రెండవ రకతులో 'రుకూ' లోకి వెళ్ళకముందు 3 తక్బీర్లు.

పండుగ నమాజ్‌లలో అదనపు తక్బీర్లు పలికే సమయంలో కూడా 'రఫెయదైన్' చేయటం సంప్రదాయమని ఇమామ్ ఇబ్నె ముంజిర్, బైహఖీలు పేర్కొన్నారు.

(٣٩٦) وَعَنْ أَبِي وَاقِدٍ اللَّيْثِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَقْرَأُ فِي الْأَضْحَى وَالْفِطْرِ بِـ «ق، وَاقْتَرَبَتْ». أَخْرَجَهُ مُسْلِمٌ.

396. హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ అజ్హా మరియు ఈదుల్ ఫిత్ర్ నమాజులలో సూరయె ఖాఫ్ మరియు ఇఖ్తరబతిస్సాఅ సూరాలు పఠించేవారు." (ముస్లిం)

**సారాంశం**

పండుగ నమాజులలో ఏ సూరాలు పఠించినా నమాజు నెరవేరుతుంది. అయితే ప్రవక్త (సఅసం) అనుసరణకు ప్రతీకగా ఈ రెండు సూరాలను చదవటం మంచిది.

(٣٩٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا كَانَ يَوْمُ الْعِيدِ خَالَفَ الطَّرِيقَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وِلأَبِي دَاوُدَ عَنِ ابْنِ عُمَرَ نَحْوُهُ.

397. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి మరో దారిగుండా తిరిగి వచ్చే వారు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు- అబూదావూద్‌లో ఇబ్నె ఉమర్ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది)

**సారాంశం**

ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి, మరో దారిన రావటం వల్ల ప్రజాబాహుళ్యంలో పండుగ వాతావరణాన్ని సృజించినట్లవుతుంది. పండుగ రోజున వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు పలికే తక్బీర్లతో వీధి వీధి, వాడ వాడ ప్రతిధ్వనిస్తుంది. దేవుని గొప్పదనం, ఘనత చాటబడుతుంది. తద్వారా ఇస్లాం వైభవం కూడా వ్యక్తమవుతుంది.

(٣٩٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَدِمَ رَسُولُ اللّٰهِ ﷺ الْمَدِينَةَ، وَلَهُمْ يَوْمَانِ يَلْعَبُونَ فِيهِمَا، فَقَالَ: قَدْ أَبْدَلَكُمُ اللّٰهُ بِهِمَا خَيْراً مِنْهُمَا: يَوْمَ الْأَضْحَى، وَيَوْمَ الْفِطْرِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ بِإِسْنَادٍ صَحِيحٍ.

398. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా ఏతెంచినపుడు అక్కడ ఏడాదికి రెండు రోజులు ఆటపాటలకై, వినోదానికై ప్రత్యేకించబడి ఉండటం గమనించారు. "అల్లాహ్ మీ కోసం ఈ రెండు దినాలకు బదులుగా ఇంతకన్నా మేలైన రెండు దినాలను ప్రసాదించాడు. ఒకటి : ఈదుల్ అజ్హా. రెండవది :

ఈదుల్ ఫిత్ర్.'' (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు - దీని ఆధారం ప్రామాణికమైనది)

**సారాంశం**

షరీయత్ పరిధిలో వుంటూ పండుగ దినాలలో ఆనందంగా ఆటలాడుకోవటం, విద్యా పాటవం ప్రదర్శించటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే అవధులు మీర కూడదు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధమైన వెకిలి చేష్టలకు, ధన మాన ప్రాణాలకు నష్టం కలిగించే కృత్యాలకు పాల్పడరాదు.

(٣٩٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: مِنَ السُّنَّةِ أَنْ يَخْرُجَ إِلَى الْعِيْدِ مَاشِياً. رَوَاهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

399. ఈద్గాహ్ వైపునకు నడచి వెళ్లటం సున్నత్ (సంప్రదాయం)అని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. (దీనిని తిర్మిజీ నకలు చేశారు. 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈద్గాహ్‌కు నడచి వెళ్లడం ఎక్కువ పుణ్యప్రదమయిన విషయం. పండుగ నమాజ్ కోసం ఎన్ని అడుగులు వేస్తే అన్ని సత్కార్యాలు లిఖించబడతాయి. ఒకవేళ ఈద్గాహ్ చాలా దూరముంటే వాహనంపై వెళ్ళటంలో తప్పులేదు.

(٤٠٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُمْ أَصَابَهُمْ مَطَرٌ فِي يَوْمِ عِيْدٍ، فَصَلَّى بِهِمُ النَّبِيُّ ﷺ صَلَاةَ الْعِيْدِ فِي الْمَسْجِدِ. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ لَيِّنٍ.

400. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: ఒకసారి పండుగ రోజున ముస్లింలను వర్షం వెంటాడటం వల్ల దైవప్రవక్త (సఅసం), వారికి మస్జిదులోనే పండుగ నమాజ్ చేయించారు. (అబూదావూద్ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

షరీయత్‌పరంగా తగు కారణమేదైనా ఉంటే అప్పుడు మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేయవచ్చునని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. సాధారణంగా ఆయన (స) ఈద్గాహ్‌లోనే పండుగ నమాజ్‌ను చేసేవారు. కాని ఒకసారి మాత్రం దైవకారుణ్యం వర్షించటం మూలంగా మస్జిదులో పండుగ నమాజ్ చేయించాల్సి వచ్చింది.

ఇక పండుగ నమాజ్ ఈద్గాహ్‌లో చేయాలా? లేక మస్జిదులలో చేయాలా? అన్న విషయమై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో సువిశాలమైన (పెద్ద) మస్జిదులో పండుగ నమాజ్ చేయటం ఉత్తమం.

ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "దైవప్రవక్త (సఅసం) జీవితాంతం పండుగ నమాజ్‌ను బహిరంగ ప్రదేశంలో - ఈద్గాహ్ స్థలంలో - ఆచరించారు. కేవలం ఒక్కసారి మాత్రం వర్షం కారణంగా గత్యంతరం లేక మస్జిద్‌లో పండుగ నమాజ్‌ను నెరవేర్చారు. కనుక పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే శ్రేష్ఠం."

హ౽్రత్ అలీ (రజి) గారి పలుకులు -

ఆయన (రజి) పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన (రజి) ఇలా అన్నారు : "ఒకవేళ బహిరంగ స్థలానికి వచ్చి ఈద్ నమాజ్ చేయటం 'మస్నూన్' (సంప్రదాయం) కాకపోయినట్లయితే నేను మస్జిద్‌లోనే నమాజ్ చేసి ఉండేవాణ్ణి."

కాబట్టి పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే సంప్రదాయం, శ్రేష్ఠం కూడా.